
ఈవారం ఈశీర్షికలో కథల ఎన్నికల
గెస్ట్ ఎడిటర్: శ్రీపమ్మి వీరభద్రరావు



నేను కథలు రాయటం ఓవిధంగా చెప్పాలంటే, వంశపారంపర్యంగా 'సంక్రమించిన విద్యే' అని చెప్పాల్సొస్తుంది. ఎందుకంటే మా నాన్నగారి పేరు నా పేరే! ఓ రెండుమూడు దశాబ్దాల క్రితం పాఠకులకి ఆయన సుపరిచితులే!!

ఓ దశాబ్దంనుంచీ రచనలు చేస్తున్నాను. అన్ని వార, మాస, దినపత్రికలు నాకథల్ని ప్రచురించటమేకాక, బహుమతులిచ్చాయికూడా ఇక ఆకాశవాణి, దూరదర్శన్ సరేసరి!

ఓ కథ రాయండి శీర్షికన వచ్చిన లెక్కకు మించిన కథల్ని పరిశీలించి, రెండింటిని ఎంపిక చేయాలన్నపుడు నాకు కొంచెం భయమేసింది- ఎందుకంటే ఏ ఒక్కరికీ అన్యాయం జరక్కూడదు కదా! అందుకే ప్రతి కథనీ క్షుణ్ణంగా చదివి 'దారి తప్పిన ప్రేమ', "చివరి ఇంటర్వ్యూ" రెండింటినీ ఎంపిక చేశాను. దీని అర్థం మిగిలిన కథలు బాగోలేవని కాదు. ఆ సంఖ్యను మించి ప్రచురించటం వీలుకాదనే!

రూపాయికి "రీఫిల్" కూడ రాని రోజుల్లో మంచి వినూత్నమైన పత్రికని అందిస్తున్న 'స్రవంతి' యాజమాన్యాన్ని, ప్రత్యేకించి శ్రీమల్లాదిని అభినందించలేకుండా వుండలేకపోతున్నాను.

స్రవంతి నెం: 2లో ఇచ్చిన వాక్యం ఆధారంగా రాసిన కథలు

**ఆ రోజు రాజు నల్లగళ్ళచొక్కా వేసుకోకపోతే అసలు ఈ కథే వుండేదికాదు.**

## చివరి ఇంటర్వ్యూ

రాజు విజయవాడ వచ్చాడు. ఏదో ఉద్యోగానికి ఇంటర్వ్యూకి. ఇంటర్వ్యూ అయిపోయింది. బాగానే చేసాననుకున్నాడు. ఉద్యోగం వస్తుందన్న ఆశతో మనసు హుషారుతో నిండిపోయింది. సాయంత్రం సిటీ చూద్దామన్న ఉద్దేశంతో నీట్‌గా తయారై తనకెంతో ఇష్టమై కుట్టించుకున్న నల్లగళ్ళ చొక్కా వేసుకొని, దిగిన లాడ్జిరూమ్ తాళం వేసి రోడ్డుమీద కొచ్చాడు.

సందె చీకట్లు ముసురుకుంటున్న వేళ చీకటిని చెదరగొట్టడానికి వెలుగుతున్న నియాన్‌లైట్ల వెలుతురులో రోడ్ల కటూ ఇటూ వెల్తురు నిండి మెరిసిపోతున్న షాపులవంక చూసుకుంటూ, నడుస్తున్న రాజును దూసుకుపోయాడో వ్యక్తి. "అరె అచ్చం నాలాంటిషర్టు వేసుకున్నాడు." అనుకున్నాడు రాజు. సరిగ్గా అదే సమయానికి రాజు భుజంమీద చేయిపడింది. "పదరా నాకొడకా" అనే మాట వినబడింది. రాజు అదిరిపడి వెనక్కి తిరిగి చూసేసరికి ఓ పోలీస్ వున్నాడు. "ఏరా నా కళ్ళు గప్పి పారిపోదామనుకున్నావా నడు స్టేషన్‌కు." అంటూ మెడమీద చెయ్యివేసి తోసాడు. "నే... నేనేం తప్పు చేసాను." అన్నాడు ధైర్యం తెచ్చుకొని రాజు." "ఏం చేసావా స్టేషన్‌లో చెపుతాను పదబే" అని లాఠీతో ఒక్కటిచ్చాడు.

స్టేషన్ చేరుకున్న తరువాత ఇనస్పెక్టర్ అన్నాడు. "తోసేయండి లాకప్పులో నా కొడుకుని". "ఇంటరాగేషను చేయమాసార్" అన్నాడు పోలీస్. "అదివేరేచెప్పాలా" అన్నాడు ఇనస్పెక్టర్. వెంటనే లాఠీ ఝుళిపిస్తూ గదిలోకి వచ్చి లాఠీతో వళ్ళంతా హూనం చేసాడు, చివరగా లాఠీతో ఎక్కడో కొట్టాడు. తగలరానిచోట తగిలిందేమో లాఠీ. రాజుప్రాణం హరీమంది. ఆ పోలీసోడు కొంచెం బేజారెత్తి "ఆడు సచ్చిపోయాడు సార్" అన్నాడు. ఇనస్పెక్టర్‌కూడా బెంబేలెత్తి "నేను డ్యూటీలోవుండగా జరిగింది నామీద కొస్తదేమో. ఆడు పోలీస్‌స్టేషన్‌లో ఉరేసుకున్నాడని పేపర్లకి స్టేట్ మెంటిద్దాం పద అన్నాడు.

ఆదేసమయానికి రాజు రాలేదని రాజు తల్లి తండ్రులు పోలీస్ రిపోర్టు, పేపరు ప్రకటన ఇచ్చారు. ఈ లోపులో అసలుతప్పు చేసినవాడు నల్లగళ్ళ చొక్కా వేసుకున్నవాడు దొరికాడు. రాజును పట్టుకున్న పోలీస్‌కు అసలు విషయం అర్థం అయింది. రాజు లాకప్పు మరణంవిషయం తెలిసిన కొందరు ఆందోళన లేవదీసారు. మొత్తానికి పోస్ట్‌మార్టమ్ జరిగింది. అసలుకథ బయట పడింది. "ఆ రోజు రాజు నల్లగళ్ళచొక్కా వేసుకోకపోతే ఈ కథే వుండేదికాదు.

—వై. మంజుల (కాకినాడ-4)

## దారితప్పిన ప్రేమ

సుధీర్ బస్ స్టాప్‌దగ్గర నిలబడి కొన్ని గజాల దూరంలో ఉన్న రేఖ అందాలను తనివితీరా చూస్తున్నాడు. రోజూ అదేటైమ్‌లో రేఖ అందాలను ఆస్వాదించడం ఒక నెలనుంచి సుధీర్ దినచర్యలో భాగమైంది. రోజు రోజుకు రేఖ అందం సుధీర్‌ను పిచ్చివాణ్ణి చేస్తుంది. ఎలాగోలా కష్టపడి రేఖ అడ్రసు నిన్ననే సంపాదించాడు. నిన్నరాత్రంతా కూర్చొని రేఖకు ప్రేమలేఖకూడా వ్రాసాడు! కాని దాన్ని రేఖకు అందించే ధైర్యం సుధీర్‌కు లేదు! రేఖను చూడలేండి ఉండలేక పోతున్నాడు. అప్పుడే వచ్చిన సిటీబస్‌లో రేఖ వెళ్ళిపోయింది. సుధీర్‌గాఢంగా నిట్టూర్చి ఒక నిర్ణయానికి వచ్చాడు. దగ్గరలోఉన్న పోస్టాఫీస్‌కు వెళ్ళి ప్రేమలేఖను పోస్ట్‌చేశాడు. ఆ క్షణంనుంచి ఒక భయం సుధీర్ మనస్సును ఆక్రమించుకుంది! దానికి పరిష్కారం ఎలా అని ఆలోచించాడు! కొన్ని క్షణాల్లో సుధీర్ బుర్రలో ఒక ఐడియా ఫ్లాష్‌లా వెలిగింది.

ఇందిరా పార్క్‌లో ఒక మూలనున్న గులాబీ మొక్కదగ్గర రాజు ఏదో ఆలోచిస్తూ కూర్చొన్నాడు. ఇంతలో నలుగురు వ్యక్తులు రాజు దగ్గరకువచ్చి నిలబడ్డారు. అందులో ఒకవ్యక్తి రాజుకాలర్ దొరకబుచ్చుకొని పైకిలేపి ఒక్కగుద్దు గుద్దాడు. ఇదేమి అని అడిగే అవకాశం రాజుకు లేకపోయింది. సమయానికి తన ఫ్రెండ్ సుధీర్ కూడా లేడు! మిగిలిన ముగ్గురుకూడా రాజును ఒక అయిదు నిముషాలు బంతిలా ఆడుకున్నారు. ఆటఅయ్యాక షేపులు మారిపోయి స్పృహ తప్పుతున్న రాజుతో 'జాగ్రత్త! ఇంకోసారి నాచెల్లెలికి ప్రేమలేఖ వ్రాయడంలాంటి పిచ్చిపని చేశావో ప్రాణాలు దక్కవ్" అని వార్నింగ్ ఇచ్చి మిగిలిన ముగ్గురితో కలిపి వెళ్ళిపోయాడు ఒకవ్యక్తి! ఈ తంతు దూరంగావున్న పొద దగ్గర కూర్చుని సుధీర్ దొంగచాటుగా చూశాడు. వాళ్లు వెళ్ళిపోయిన తర్వాత రాజుదగ్గరకు వచ్చి స్పృహ తప్పిన అతన్ని దగ్గరలో ప్రైవేట్ హాస్పిటల్‌కు తీసుకెళ్లాడు! డాక్టర్ రాజుకుతగిలిన దెబ్బలను పరిశీలించి చేయి ఫ్రాక్చర్ అయిందని అక్కడే కొన్నిరోజులు వుండాలని చెప్పాడు! డాక్టర్ వాడిన మందులకు స్పృహ వచ్చినరాజుకు అంతాగుర్తుకు వచ్చింది! ఆ రోజు సుధీర్ తనను బలవంతంగా ఆతని నల్లగళ్ళ షర్టువేసుకొని తనతో పార్క్‌కు ఎందుకు రమ్మన్నాడో అర్థం అయింది! అనుకున్నవిధంగా అమ్మాయేవస్తే తనను పరిచయం చేసుకోవచ్చని, ఇటువంటి సిచ్యుయేషన్ వస్తే తనను బలిపశువు చేయొచ్చని సుధీర్ వేసినప్లాన్ అని గ్రహించాడు! అతని నీచపుబుద్ధికి రాజుకు అసహ్యం కలిగి అప్పుడే ఆతని స్నేహానికి గుడ్‌బై చెప్పాడు.

దానికి ఏ మాత్రం బాధపడలేదు సుధీర్! రేఖను గాఢంగా ప్రేమిస్తున్నానని, ఇష్టమైతే ఆ రోజు సాయంత్రం ఇందిరా పార్క్‌లో ఆ మూలనవున్న గులాబీ మొక్కదగ్గర నల్లగళ్లషర్టు వేసుకుని ఎదురు చూస్తుంటానని, ఈజీగా గుర్తుపట్టొచ్చని, వచ్చి కలవమని తన ప్రేమలేఖలో వ్రాశాడు! రాజుకు నల్లగళ్ళచొక్కా ఇవ్వడంవలన తనకు తన్నులు తప్పినందుకు ఎంతో ఆనందపడిపోయాడు మిస్టర్ సుధీర్.

కాని అదేరేఖ ఆ ప్రైవేట్ హాస్పిటల్‌లో నర్సు, తనపిన్ని అయిన సుజాతమ్మద్వారా విషయం తెలుసుకుని, అమాయకుడైన రాజును చూచేటందుకు వచ్చి, అతన్ని ప్రేమించి, పెళ్ళి చేసుకుందని, తనఅపురూపమైన అందాలన్ని రాజు స్వంతం చేసిందని ఫూల్ సుధీర్‌కు ఇంతవరకు తెలీదు.

నిజ్జంగా, ఆ రోజు రాజు నల్లగళ్ల చొక్కా వేసుకోకపోతే ఈ కథంతా వుండేది కాదు.

—డా. కె. మురళీధర రెడ్డి (కడప)